క్లుప్తంగా

30 లీటర్ల నాటుసారా స్వాధీనం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో పరకాల ఎక్సైజ్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన శివతిరుపతి 30 లీటర్ల నాటుసారాను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. దాడుల్లో ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్స్ అఖిల్, దిలీప్ పాల్గొన్నారు.

మూడు నెలలైనా అందని పట్టాపాస్ పుస్తకాలు

ఆత్మకూరు: రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని మూడు నెలలు అవుతున్నా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. జూలై నెలలో రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఇప్పటి వరకు ఇవ్వడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్ అయిన పక్షం రోజుల్లో పాస్ పుస్తకాలు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కూడా ఇవ్వకపోవడంలో అంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యంతోనే అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే సరైన సమాధానం దొరకడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

దామెర: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని సింగరాజుపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుల లక్ష్మీనారాయణ(79) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఈనెల 22న ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా తన పొలానికి గడ్డి మందు పిచికారీ చేశాడు. ఈ క్రమంలో తుంపిర్లు అతని శ్వాస ద్వారా, స్వేదరంధ్రాల ద్వారా శరీరంలోకి చేరగా మరుసటిరోజు 23న అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన బంధువులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించా రు. పరిస్థితి విషమించి ఈనెల 28న సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు



కాజీపేట అర్బన్: చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, గౌడకుల విద్యార్థులు విద్యారంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ ఆకాంక్షించారు. హంటర్‌రోడ్డులోని కాకతీయ గౌడ హాస్టల్ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, కౌండిన్య పరపతి సంఘం సౌజన్యంతో 2023 -24వ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన పేద గౌడ విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయన్నగౌడ్ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షుడు అంబాల సూర్యనారాయణ గౌడ్, గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈవీ.గౌడిశాల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, కేయూ పాలక మండలి సభ్యుడు చిర్ర రాజుగౌడ్, గోపా వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, కౌండిన్య పరపతి ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి గట్టు సత్యనారాయణ గౌడ్, కొండ నరేందర్, బత్తిని రమేష్‌గౌడ్, కోలా ప్రతాప్, సురేందర్, ప్రభాకర్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ఉసిరి.. లాభాల సిరి

- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి
- ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ
- ఏడాదిలో రెండు సార్లు పంటలు



భీమదేవరపల్లి శివారులో సాగుచేసిన ఉసిరి పంట



కొమ్మలకు కాసిన ఉసిరికాయలు

ఎల్కతుర్తి : పోషకాల సిరి ఉసిరి రైతుకు సిరులు కురిపిస్తోంది. ఒక్కసారి సాగుచేస్తే నలభై ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు కూడా తక్కువే.

భీమదేవరపల్లి మండలం శివారు ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే, ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తనకున్న సుమారు 60 ఎకరాల్లో 5 ఎకరాలు ఉసిరి పంట సాగుచేశారు. మిగతా ఎకరాల్లో సపోట, మామిడి తోటలు సాగు చేశారు. కాగా ఉసిరి మొక్కలు ఎకరాకు 65 మొక్కల చొప్పున గత 20 ఏళ్ల క్రితం నాటి 5 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట ఏడాది కాలంలో రెండు క్రాప్‌లు కాత (రెండుసార్లు) ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జిస్తోంది. ఉసిరిలో ఎక్కువగా ఔషధ గుణాలు ఉండడం, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ఈ పచ్చడి చాలా బాగ పనిచేస్తుందని వైద్యులు చెబుతుండడంతో మార్కెట్‌లో ఉసిరికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ప్రతీ ఒక్కరు జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలైనా నాటాలని పూర్వీకులు చెబుతారు. శరీరంలో రోగనిరోధక శక్తి పెరగాలంటే సి-విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తినాలి. కరోనా పుణ్యమా అని ఈ విషయం పసివాళ్ల నుంచి వృద్ధుల వరకూ తెలియడంతో ఉసిరి కాయలపై మక్కువ పెంచుకున్న ప్రజలు ఉసిరి పచ్చళ్లు ఎక్కువగా వాడుతున్నారు. ఈ మొక్కలు 20 ఏళ్ల క్రితం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ సమీపంలో ఉన్న ఉద్యానవన శాఖ కార్యాలయం నుంచి తెచ్చి సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉసిరి పంట కోత దశలో ఉంది. ఇందులో ఒక్క ఎకరం క్రాప్ కోసి సమీపం పట్టణాలైన కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, హనుమకొండ, వరంగల్ పట్టణాలకు తరలించి విక్రయించినట్లు తెలిపారు. ఎకరానికి రూ.50 నుంచి లక్ష దిగుబడి వస్తున్నట్లు పేర్కొన్నారు. ఉసిరి చెట్టు నీటి ఎద్దడిని చాలావరకు తట్టుకుంటుందన్నారు. భీమదేవరపల్లి మండలం పూర్తిగా మెట్ట ప్రాంతమైనందున ఉసిరి, సపోటా, మామిడి తోటలు సాగుచేసినట్లు వివరించారు. కా గా ఉసిరి కాయలతో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపులు, ఊరగాయలు తయారు చేసి మార్కెట్‌కు విక్రయిస్తారు.

పంటకు తెగుళ్లు తక్కువ



గత 20 ఏళ్ల క్రితం ఉసిరి పంట సాగుచేశాను. ఈ పంటకు తెగుళ్లు, చీడపీడల సమస్య ఎక్కువగా ఉండదు. పంట మధ్య కలుపు పెరగకుండా చూసుకుంటూ చెట్లను పరిశీలించి కొంతమేర తె గుళ్లు రాకుండా మందులు స్ప్రే చేసుకుంటే సరిపోతుంది. మంచి దిగుబడి చూడవచ్చు. ఎకరా కు రూ. 50 నుంచి 1లక్షా వరకు లాభం వస్తుంది.

– అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ముల్కనూర్ సొసైటీ బ్యాంకు చైర్మన్

ప్రజాసమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



మాట్లాడుతున్న బొట్ల చక్రపాణి

ఐనవోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సంపదను పెట్టుబడిదారులకు అప్పచెబుతున్నారని.. ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీపీఎం మూడో మహాసభ ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఇటీవలి కాలంలో మృతి చెందిన పార్టీ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన చక్రపాణి మాట్లాడుతూ రైతాంగానికి కనీస మద్దతు ధర కావాలని పోరాటం చేయగా ప్రధాని మోదీ హామి ఇచ్చి.. ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ఆలస్యం చేస్తుందన్నారు. కుంటిసాకుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తి చేయలేదన్నారు. రైతు భరోసా అమలు చేయకపోవడంతో రైతులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరికి రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, నూతన పింఛన్ల మంజూరీ, పెంపు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ప్రతినెల రూ.2500 తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని సీపీఎం శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా దీకొండ ఉప్పలయ్య, మాదాసి పోచమ్మ, సహాయ కార్యదర్శులుగా నారాయణరెడ్డి, సరోజనలు ఏకగ్రీవంగా ఎన్నుకోగా మండల నాయకులు కాడబోయిన లింగయ్య, మాదాసి యాకూబ్, దర్శనాల సంపత్, యాకయ్య, కవిత, మణెమ్మ, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ ఎందుకు గెలువలేదు..?



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాంబయ్య

ఐనవోలు: మాలలు 6 వేల మంది ఉంటే మాదిగలు 60 వేల మంది ఉన్నారని ప్రచారం చేస్తున్న నాయకులు గతంలో మందకృష్ణ మాదిగ మధిర, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎందుకు గెలువలేదో చెప్పాలని కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలోని నందిసెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల తీరుపట్ల ఎస్సీ నాయకులతో కలిసి సాంబయ్య నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడిన మాటలను వక్రీకరించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మార్పీఎస్ దృష్టిలో ఎమ్మెల్యే కేవలం మాలలకు ఏజెంట్‌గా పనిచేస్తున్నారని మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. దళిత కులాలు ఎప్పటికీ బీజేపీని ఆదరించవని ఎమ్మార్పీఎస్ నాయకులు గ్రహించాలన్నారు. బీజేపీకి ఎమ్మార్పీఎస్ నాయకులు దూరంగా ఉంటే మంచిదని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, మండల నాయకులు కొత్తూరు కల్పన మధుకర్, యాకర మంజుల యాదగిరి, కొత్తూరి ప్రతాప్, అశోక్, తరుణ్, జిల్లా నాయకులు జగన్, ఆనందం, రాములు, స్వామి పాల్గొన్నారు.

కార్మికులను బెదిరిస్తున్న 'మత్స్య సొసైటీ'



మాట్లాడుతున్న మత్స్యకార్మికులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టులో 13 గ్రామాల మత్స్య కార్మికులు చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారని చలివాగు ప్రాజెక్టు సొసైటీ నూతన పాలకవర్గం చలివాగు ప్రాజెక్టును కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం మత్స్యకార్మికులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చలివాగు ప్రాజెక్టు చైర్మన్ గండి రాజమౌళి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రాజెక్టు చెరువును కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ లేకుంటే మీ సభ్యత్వాలు రద్దు చేస్తానంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులకోసారి పెద్ద మనుషుల సమావేశం అంటూ నూతన సభ్యత్వాలు ఇప్పిస్తామంటూ పెద్దమనుషులను పిలిపించుకొని ఒక్కరికి రూ.500 ఇచ్చుకుంటూ అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకుంటున్నాడని ఆరోపించారు. పెద్ద మనుషులు సంతకాలు చేశారంటూ చేప పిల్లలు ఎవరూ పట్టవద్దని బె దిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆది వారం పెద్ద మనుషుల సమావేశం అని పెద్దమనుషులకు నోటీసులు పంపి చేపలు పట్టని నాలుగు గ్రామాల పెద్ద మనుషులతో కాంట్రాక్టు ఇస్తామంటూ సంతకాలు తీసుకున్నారని తెలిపారు. గత 10 ఏళ్ల క్రితమే కాంట్రాక్టర్ పద్ధతిని రద్దు చేశారని తెలిపారు. మళ్లీ చైర్మన్ కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే మా కుటుంబాలు రోడ్డు పాలవుతాయని మాకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి సొసైటీ చైర్మన్ రాజమౌళిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దొడ్డి కొమురయ్య చరిత్ర విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా సినిమాను రూపొందిస్తున్నట్లు సినీ దర్శకుడు సేనాపతి అన్నారు. హనుమకొండ పద్మాక్షికాలనీలోని డాక్టర్ జగదీష్‌బాబు ఆస్పత్రిలో పలు కుల సంఘాలతో సినీ నిర్మాణ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్మాణ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ సాగంటి మంజుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సేనాపతి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం , వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ప్రపంచానికి మరింత లోతుగా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ కోచైర్మన్ ధరావత్ రామచంద్ర నాయక్, నిర్మాతలు మండలోజు కృష్ణమూర్తి, కురిమిళ్ల శ్రీదేవి, సాయిబాబా, జిల్లా కన్వీనర్ రావుల సురేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశం అగ్రగామి



ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

శాయంపేట : అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ భారతదేశం అగ్రగామిగా నిలిచిందని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి అన్నారు. శాయంపేట గ్రామంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ విశ్రాంతి లేకుండా దేశ ప్రజల కోసం పనిచేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ప్రతీ ఒక్క భారతీయుడు బీజేపీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం ప్రధాని మోదీ ప్రతి నెలా ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మండల నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు చంద్రమౌళి, నవీన్, రాజశేఖర్, రమేష్, రాజేష్, సుధాకర్, సాంబయ్య, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంద నరేశ్

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారెపల్లి రవీందర్(బుజ్జన్న) పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా, మండలానికి చెందిన వైద్యుల వెంకటరాజిరెడ్డి, శానం కుమారస్వామి డైరెక్టర్లుగా ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేసుకుంటూ బాణసంచాపేల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు శాయంపేట అంబేడ్కర్ సెంటర్ నుంచి బైక్ ర్యాలీగా పరకాల మార్కెట్‌కు తరలివెళ్లారు. అనంతరం మారెపల్లి రవీందర్(బుజ్జన్న)కు, వైద్యుల వెంకటరాజిరెడ్డికి, శానం కుమారస్వామికి పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, మోత్కూరి భాస్కర్, కట్టయ్య, బాబు, రంజిత్, ప్రశాంత్, కేయూ విద్యార్థి నాయకుడు మంద సురేష్ ఉన్నారు.

వర్గీకరణకు అనుకూలమా.. వ్యతిరేకమా ?



సంఘటితంగా ఉండాలని చేయి చేయి కలిపిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

ఐనవోలు : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా లేక వ్యతిరేకమా స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు బిర్రు మహేందర్, బొక్కల నారాయణ మాదిగలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు చింత అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇటీవల మాల ఉద్యోగుల సమావేశంలో మాదిగలు తనకు ఎవరూ ఓటు వేయలేదని చులకనగా మాట్లాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి కోర్టు ఖర్చుల నిమిత్తం తన నెల జీతం రూ.2.7 లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే నాగరాజు ప్రకటించారన్నారు. అందుకే వ్యతిరేకించామని ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఒక్క కులానికి వత్తాసు పలుకడం ఏంటని ప్రశ్నించారు. అందుకే ఎమ్మెల్యే నాగరాజు తన పదవికి రాజీనామా చేయాలని.. లేదంటే మాదిగ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తీరును ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బరిగెల వెంకటస్వామి, మహేందర్, చంద్రమౌళి, కట్కూరి రమేష్, స్వామి, చేరాలు, భాస్కర్, రమేష్, బాబు, ఐలయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

విషజ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

- ఇంటింటి సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు
- పీహెచ్‌సీలో అందుబాటులో వైద్యసేవలు



జీపీ సిబ్బందికి పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది (ఫైల్)

శాయంపేట : ప్రస్తుత సీజన్‌లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయని వాటి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స జరుపుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పలు విషయాలను వెల్లడించారు. ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేశారని, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ కేంద్రాల్లో మలేరియా, డెంగీ, డబ్ల్యూబీసీ, టైఫాయిడ్ టెస్టులు నిర్వహిస్తున్నామని సీబీపీ రక్త పరీక్షలు, ప్లేట్లెట్ కౌంట్, ఆర్బీస్ పరీక్షలు నిర్వహించి రిజల్ట్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, ఎల్ఎఫ్‌టీ, కిడ్నీ పరీక్షలు, కొలెస్ట్రాల్ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించి శాంపిల్స్ వరంగల్‌లోని టీ హబ్‌కు పంపించి రెండు మూడు రోజుల్లో రక్త పరీక్షల ఫలితాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు క్యాల్షియం, బి-12, యూరిక్ యాసిడ్ పరీక్షలు చేసి వరంగల్ టీ హబ్‌కు రక్త నమూనాలు పంపిస్తున్నామని డాక్టర్ పేర్కొన్నారు.

మినరల్ వాటర్‌తో జాగ్రత్తలు తీసుకోవాలి

మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో, బీసీ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌లో, కేజీబీవీ బాలికల గురుకుల పాఠశాలలో, మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ ఆర్వో నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. గురుకుల పాఠశాలలో ఆర్వో నీటిలో బ్యాక్టీరియా ఫామ్ అయిందని, ఆర్వో సర్వీసింగ్ చేయించుకున్నట్లయితే సమస్య ఉండదని తెలిపారు. ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌లో సేకరించిన ప్లాంట్ అధిక మోతాదులో బ్యాక్టీరియా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. త్వరలో మండల కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ నమూనాలు సేకరించి టెస్ట్‌కు పంపుతామని తెలిపారు. ప్రైవేట్ మినరల్ వాటర్‌పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఘనంగా మస్తాన్‌బాబా గంధం జాతర



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గాలో ఆదివారం మస్తాన్‌బాబా గంధం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ (సైలానిబాబా) ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, చాదర్లు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాండ్ వాయిద్యాలతో గుర్రంపై గంధం తీసుకొచ్చి మస్తాన్‌బాబా దర్గాలో దువా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కులమతాలకతీతంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని చాదర్లు సమర్పించారు. మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై అశోక్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో అమీర్‌బాబా, ఎస్‌కే మోయిన్, కొమ్మాలు, హరినాథరావు, మసూద్ పాషా పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్ద పీట



ప్రమాణస్వీకారం చేస్తున్న కొత్త పాలకవర్గం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- పరకాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పరకాల: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరకాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయగా.. ఆర్టీసీ డిపో నుంచి మార్కెట్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే రేవూరితోపాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య పాల్గొన్నారు. చైర్మన్‌గా చందుపట్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా మారపెల్లి రవీందర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, మార్కెట్ అభివృద్ధికి, రైతులకు మరిన్ని సేవలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. పరకాల వ్యవసాయ ఆధారిత ప్రాంతం కాబట్టి రైతులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలతో ఉపాధితోపాటు రైతులకు రవాణా ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నా రు. శిథిలమైన గోదాముల స్థానంలో కొత్తవాటిని నిర్మించడంతోపాటు మార్కెట్‌కు కోల్డ్ స్టోరేజ్, వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మార్క విజయ్, కాంగ్రెస్ పార్టీ పరకాల, నడికూడ, శాయంపేట మండలాల అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, బుర్ర దేవేందర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. పరకా ల మార్కెట్ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవా నికి 'కూడా' చైర్మన్ వెంకట్రామిరెడ్డిని ఆ హ్వానించకపోవడంపై ఆయన అనుచరులు అలిగినట్లు సమాచారం.

47 ఏళ్ల అపూర్వ కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాయంపేట: 47 ఏళ్ల క్రితం చదివిన మిత్రులంతా ఆదివారం ఒకే వేదికపై కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1972 నుంచి 1977 వరకు 6వ తరగతి నంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం స్థానిక ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ముందుగా తమతో పాటు చదువుకుని అమరులైన తోటి మిత్రులు, ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పూర్వ విద్యార్థి జి.నరసింహారాములు చేసిన చమత్కారాలతో, అల్లరి చేష్టలతో సభా ప్రాంగణంలో నవ్వులు విరిశాయి. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులు వేముల ప్రతాప్‌రెడ్డి, బేరి యాదగిరి, జున్నుతుల ఆదిరెడ్డి, సాయన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సర్వర్‌ను పూలమాలలు, శాలువా, మెమెంటో, బహుమతులతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు ప్రభాకర్, రాజసమ్మయ్య, సుదర్శన్, రాజయ్య, చంద్రమౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.